మౌలిక వసతుల కల్పనకు కృషి



సీసీరోడ్డు పనుల శంకుస్థాపనలో మాజీ కార్పొరేటర్‌ దుర్గమ్మ

బోడుప్పల్‌: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు 15వ డివిజన్‌ మాజీ కార్పొరేటర్‌ కొత్త దుర్గమ్మగౌడ్‌ అన్నారు. రూ 35లక్షలతో బాలాజీనగర్‌, బొల్లిగూడ సీసీరోడ్డు పనులకు ఆమె ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో తన డివిజన్‌ పరిధిలో దశలవారీగా మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతనిచ్చినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రారంభించిన పనులను త్వరతిగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కాంగ్రెస్‌ పార్టీ మేడ్చల్‌ నియోజకవర్గ బీ– బ్లాక్‌ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్‌, కాలనీవాసులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



వెంకటాపురంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్‌: ప్రజల దాహార్తికి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వెంకటాపురం డివిజన్‌ ప్రధానరోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మాజీ ఎంబీసీ కార్పొరేషన్‌ చైర్మన్‌ నందికంటి శ్రీధర్‌, కార్పొరేటర్‌ సబితాఅనిల్‌కిషోర్‌, నిర్వాహకులు శ్రీనివాసులు, బీఆర్‌ఎస్‌ నేతలు జేఏసీ వెంకన్న, మేకల రాముయాదవ్‌, హేమంత్‌పటేల్‌, డోలి రమేష్‌, పవన్‌, సురేష్‌, శరణగిరి, కాలనీవాసులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు సత్కారం



మల్లాపూర్‌: నాచారం అన్నపూర్ణ కాలనీలోని బుడగ జంగాల శ్మశానవాటిక అభివృద్ధి కోసం కార్పొరేటర్‌ శాంతిసాయిజెన్‌శేఖర్‌ రూ.50 లక్షల నిధులు మంజూరు చేయించినందుకు ఆదివారం బుడగ జంగాల సంఘాల ప్రతినిధులు కార్పొరేటర్‌ను సత్కరించారు. నర్సింహ, కిష్టయ్య, నరసింహ, శంకర్‌, శివరామ్‌, కృష్ణ, సుధాకర్‌, మల్లేష్‌, రాము, శ్రీకాంత్‌, రాహుల్‌ తదితరులున్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్‌ సునీత

గౌతంనగర్‌: డివిజన్‌ జయగిరి లక్ష్మీనరసింహ స్వామినగర్‌లో గత మూడు రోజులుగా కొనసాగుతున్న నల్లపోచమ్మ, మహంకాళి, ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్‌ మేకల సునీతారాముయాదవ్‌లు హాజరై అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాండురంగన్‌, సత్యనారాయణ, సాధు పరమేష్‌, శ్యామ్‌గౌడ్‌, రాజా మల్లేష్‌, స్థానిక నేతలు వెంకన్న, సిద్ధి రాములు, హేమంత్‌పటేల్‌, కిట్టు, నర్సింగ్‌, లక్ష్మణ్‌ తదితరులున్నారు.

ప్రధాన కూడలిలో బ్యూటిఫికేషన్‌



బ్యూటిఫికేషన్‌ చేసిన అల్వాల్‌ సర్కిల్‌ జీహెచ్‌ఎంసీ సిబ్బంది

అల్వాల్‌: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా అల్వాల్‌ సర్కిల్‌ జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాన కూడలిలో బ్యూటిఫికేషన్‌ పనులు చేశారు. దీనిలో భాగంగా చెట్లకు రంగులతో ముగ్గులు వేసి బ్యూటిఫికేషన్‌ చేశారు. జవాన్‌ చిత్తారి, ఎస్‌ఎఫ్‌ఏలు వెంకటేష్‌, వెంకట్రామ్‌రెడ్డి, భాస్కర్‌, విష్ణువర్ధన్‌రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల చూపు..క్రీడల వైపు

- ఇదే అదునుగా వెలుస్తున్న క్రీడా మైదానాలు
- ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న తల్లిదండ్రులు
- సెలవుల్లో కోచింగ్‌ సెంటర్లకు పెరిగిన డిమాండ్‌



ప్రాక్టీస్‌ చేస్తున్న క్రీడాకారులు

బోడుప్పల్‌: బోడుప్పల్‌ నగర పాలక సంస్థ పరిధిలో విద్యార్థులు రోజు రోజుకు క్రీడలపై ఆసక్తి చూపుతున్నారు. వారి తల్లిదండ్రులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సహిస్తున్నారు. దీంతో బోడుప్పల్‌లో కోచింగ్‌ సెంటర్లకు డిమాండ్‌ పెరుగుతోంది. విద్యార్థులకు వేసవి సెలవులు కూడా కలిసొస్తున్నాయి. వారి ఆరోగ్యం విషయంలోనూ తల్లిదండ్రుల ధోరణిలో మార్పు కనిపిస్తోంది.

సెల్‌ఫోన్‌కు దూరం చేసేందుకు..

సెల్‌ఫోన్‌ వ్యసనాన్ని పిల్లల నుంచి దూరం చేయడంతో పాటు శారీరక శ్రమ ఉండేలా ఏదో ఒక శిక్షణ ఇప్పిస్తున్నారు. అంతేకాకుండా ఈ మధ్యకాలంలో యువతీయువకులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా క్రీడల కోసం ప్రత్యేక మినిస్ట్రీని ఏర్పాటు చేసి, క్రీడల్లో రాణించే వారిని ప్రోత్సహిస్తుంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు క్రీడలపై చూపుతున్న ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని పలు క్రీడా శిక్షణ సంస్థలు, శిబిరాలు, స్టేడియాలు వెలుస్తున్నాయి.

30కి పైగా క్రీడా సముదాయాలు..

బోడుప్పల్‌ నగర పాలకసంస్థ పరిధిలో 30కి పైగా క్రీడా సముదాయాలు వెలిశాయి. 3 వేల మందికి పైగా విద్యార్థులు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. ప్రతిరోజు తెల్లవారుజామున 4.30 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 9 గంటల వరకు శిక్షణను ఇస్తున్నారు.

ఆటలపై ప్రత్యేక శ్రద్ధ..

కరోనా తర్వాత విద్యార్థుల తల్లిదండ్రులు ఆటలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పిల్లలకు నచ్చిన క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. పిల్లల కెరీర్‌ కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు వారి తల్లిదండ్రులు వెనకాడటం లేదు. చదువుకు అంతరాయం కలగకుండా క్రీడల్లో పాల్గొనేలా చూసుకుంటున్నారు.

- క్రికెట్‌, బాస్కెట్‌బాల్‌, బ్యాడ్మింటన్‌, కరాటే, కిక్‌బాక్సింగ్‌, తైక్వాండో పోటీల్లో రాణించే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకాలు అందుతున్నాయి. అంతేకాకుండా సమాజం నుంచి గౌరవ మర్యాదలు రావడంతో చాలామంది పిల్లలు వృద్ధిలోకి రావాలని కోరుకుంటున్నారు.

ఫిట్‌నెస్‌ కోసం వస్తున్నారు..



ఎప్పుడూ పుస్తకాలతో కుస్తీ పడుతూ ఉండే చాలా మంది విద్యార్థులు ఫిట్‌నెస్‌ కోసం వస్తున్నారు. కొంతమంది అయితే నిరంతర సాధనతో క్రీడల్లో రాణించేందుకు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం కూడా క్రీడలకు నిధులు కేటాయించి ప్రోత్సహిస్తుంది.

\- రాముగోపాల్‌గౌడ్‌, క్రికెట్‌ అకాడమీ నిర్వాహకుడు

క్రికెట్‌లో రాణించేందుకు సాధన



క్రికెట్‌లో రాణించేందుకు క్రికెట్‌ అకాడమీలో శిక్షణ పొందుతున్నాను. రోజూ ఉదయం, సాయంత్రం ప్రాక్టీస్‌ చేస్తున్నాం. మా తల్లిదండ్రులు క్రికెట్‌లో రాణించేందుకు ప్రత్యేక శిక్షణను ఇప్పిస్తున్నారు.

\- రాసాల రేవంత్‌, విద్యార్థి

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న మేడ్చల్‌ ఎమ్మెల్యే మల్లారెడ్డి

బోడుప్పల్‌: నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని మేడ్చల్‌ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్‌లో 11వ డివిజన్‌ మాజీ కార్పొరేటర్‌ కొత్త శ్రీవిద్యచక్రపాణిగౌడ్‌ సొంత నిధులతో హేమానగర్‌లో రూ 4.25 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, రూ .2.50లక్షలతో ఏర్పాటు చేసిన కాలనీ కమాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీల్లో మౌలికవసతులు కల్పించేందుకు ప్రజాప్రతినిధులు తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. బోడుప్పల్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, నేతలు కొత్త రవిగౌడ్‌, కాటపల్లి రాంచంద్రారెడ్డి, డివిజన్‌ అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, కాలనీవాసులు సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌, శ్రీనివాస్‌ గుప్తా, గోపి, జమునారాణి, లావణ్య పాల్గొన్నారు.

అరగంట వర్షానికే అతలాకుతలం !

2 గంటల పాటు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

ఉప్పల్‌: ఉప్పల్‌ పరిసరాల పరిధిలో శనివారం సాయంత్రం కురిసిన అరగంట వర్షానికి విద్యుత్‌ అధికారులు హైరానా పడ్డారు. కేవలం అరగంట వర్షం కురవడంతో దాదాపు ఉప్పల్‌ పరిధిలో 2 గంటల పాటు విద్యుత్‌ సరఫరా నిలిచిపోయి ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఫీజ్‌ ఆఫ్‌ కాల్‌కు ఫోన్‌ చేసినా స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి 10 గంటల తర్వాత విద్యుత్‌ సరఫరా కాలేదన్నారు. చెట్లకొమ్మల తొలగింపు పేరిట రూ. లక్షలు వెచ్చించినా.. కాసింతా వర్షం, కొంచెం ఈదురు గాలులు వీచినా విద్యుత్‌ సరఫరా పట్టు తప్పుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెప్పపాటు కూడా విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉండదని, ఓ వైపు ప్రకటనలు గుప్పిస్తున్నారని, అవి వాటి వరకే పరిమితమవుతున్నాయన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి..

బోడుప్పల్‌: 1వ డివిజన్‌ మాజీ కార్పొరేటర్‌ బింగి జంగయ్యయాదవ్‌ ప్రివిలేజ్‌ కాలనీలో పర్యటించారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి పొంగి పొర్లుతున్న డ్రైనేజీని ఆయన పరిశీలించారు. స్థానిక కాలనీవాసుల పిలుపు మేరకు ఆయన ఆదివారం కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆలయ నిర్వహణకు ఆటంకం కలిగించొద్దు !



సర్వసభ్య సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు

మౌలాలి: ఆలయ నిర్వహణకు ఆటంకం కలిగిస్తే సహించేదిలేదని మౌలాలి డివిజన్‌ మారుతినగర్‌ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయ వెల్ఫేర్‌ కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించి, పలు అంశాలపై చర్చించారు. ఆలయ కమిటీ మాజీ జనరల్‌ సెక్రటరీ వేంకటేశ్వరరావు హుండీ, లాకర్‌ తాళాలు తనవద్దే ఉంచుకుని దేవాలయ నిర్వహణ, కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తున్నారని, ఆయనపై తగిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు వెల్లడించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎన్‌. సాంబిరెడ్డి, చక్రపాణిగౌడ్‌, ట్రెజరర్‌ ఏఎస్‌మూర్తి, మారుతీనగర్‌కాలనీ అసోసియేషన్‌ సభ్యులు ఆంజనేయులుగౌడ్‌, ఐఎస్‌రావు, విక్రమ్‌రెడ్డి, శర్మ, సుబ్బారావు, రాజుమోహన్‌, శ్రీనివాస్‌, జీవీరెడ్డి, ప్రసాద్‌రావు, కోటిరెడ్డి తదితరులున్నారు.

మురుగు.. పరుగు !



ఉప్పల్‌ మోడ్రన్‌ బ్రేడ్‌ సంస్థ రోడ్డుమార్గంలో పొంగుతున్న డ్రైనేజీ

కాసింత వర్షానికే అదుపు తప్పిన మురుగు నీటి వ్యవస్థ

ఉప్పల్‌: ఉప్పల్‌ సర్కిల్‌ పరిధిలో వర్షానికి మురుగు నీటి ప్రవాహం అధికమైంది. ప్రధాన రహదారుల్లోని మ్యాన్‌హోల్స్‌ ఎక్కడికక్కడే పొంగిపొర్లుతూ రోడ్ల మీదకు వచ్చాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉప్పల్‌ హరిజనవాడ, వేంకటేశ్వర దేవాలయం రోడ్డు పూర్తిగా మురుగుతో నిండిపోయిందని, దీంతో ప్రజలు రోజంతా మురుగులోనే ప్రయాణం సాగించాల్సి వచ్చిందని వాపోయారు.

\- రామంతాపూర్‌ నుంచి ఉప్పల్‌ వెళ్లే ప్రధాన రహదారి నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. శనివారం కురిసిన వర్షానికి మ్యాన్‌హోల్స్‌ పొంగుతూ.. రోడ్లపై మురుగు ప్రవాహం నదిని తలపిస్తోందని, దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, లేదంటే భారీ ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

భక్తి శ్రద్ధలతో నగరేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన



అల్వాల్‌: మురళీకృష్ణ కాలనీలోని సూర్య ఎన్‌క్లేవ్‌లో నూతనంగా నిర్మించిన వాసవీకన్యకాపరమేశ్వరి సమేత నగరేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రారంభమైంది. ఉదయం గణపతిపూజ, దేవత ఆహ్వానం, యాగశాల ప్రవేశం, ప్రధాన కలశస్థాపన, చండీ యాగం ప్రారంభించారు. ఈనెల 8 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు సిరిపురం ఆనంద్‌బాబు, నాగేశ్వర్‌రావు, శ్రీను, రాంబాబు, గంగాధర్‌, రమేష్‌, రమాదేవి, మాధవి, రాధిక, సరిత, శ్రీలత, నాగరాణి తదితరులున్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్‌ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్‌: ఉప్పల్‌ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం గోకరా శ్రీలత శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. మూషికవాహనం, ముద్దుగారే యశోద, జతిస్వరం, ఏకదంతాయ, పలుకే బంగారమాయేనా తదితర అంశాలు కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

పందెం కోళ్ల శిబిరంపై దాడులు..

\- నిందితుల అరెస్ట్‌

మల్లాపూర్‌: నాచారం కౌండిన్యనగర్‌లో గుట్టుచప్పుడు కాకుండా పందెం కోళ్లు ఆడుతున్న శిబిరంపై మల్కాజ్‌గిరి ఎస్వోటీ, నాచారం పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం రాఘవేంద్రనగర్‌ సైదులు(30), మల్లాపూర్‌ సూర్యనగర్‌కు చెందిన లక్ష్మణ్‌(34), లాలాపేట్‌ హనుమాన్‌నగర్‌కు చెందిన నర్సింహ(55), వెస్ట్‌ మారేడుపల్లికి చెందిన బెల్సాజర్‌ హోరో(33), ఎల్బీనగర్‌ బ్యాంక్‌కాలనీకి చెందిన గుంజి కోటేశ్వర్‌రావు(28), చైతన్యపురికాలనీకి చెందిన బత్తుల ప్రసాద్‌(35)లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 16 పందెం కోళ్లు, రూ.41 వేలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టరేట్‌ ప్రదానం



విష్ణువర్ధన్‌రెడ్డి

ఘట్‌కేసర్‌: ఇన్‌ఫ్రా గ్రూపు చైర్మన్‌ మున్సిపాలిటీలోని ఎన్‌ఎఫ్‌సీనగర్‌ బొక్కొనిగూడకు చెందిన బొక్క విష్ణువర్ధన్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్‌ లభించింది. తమిళనాడు రాష్ట్రంలోని హుసురు పట్టణంలో జరిగిన ఏషియన్‌ ఇంటర్‌ నేషనల్‌ కల్చరల్‌ రీసెర్చ్‌ యూనివర్సిటీ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ప్రభుత్వ ఉద్యోగం వదిలి, అక్షర ఫౌండేషన్‌ సంస్థను స్థాపించి ప్రజలకు అందించిన ఆర్థిక, సామాజిక, వైద్య సేవలు, నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణను ఇచ్చారు.

రాష్ట్ర కులగణన దేశానికే ఆదర్శం

ఘట్‌కేసర్‌: తెలంగాణలో కాంగ్రెస్‌ చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శమని మున్సిపల్‌ మాజీ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య అన్నారు. ఆదివారం ఘట్‌కేసర్‌లో ఆమె మాట్లాడుతూ.. కులగణనతో రాష్ట్రంలో కులాల మధ్య ఉన్న అసమానతలు తొలగించడానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుని కాంగ్రెస్‌ ప్రభుత్వం తొలిసారి ఆచరించి, దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. కులగణనపై కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు ప్రధాని నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్‌ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్‌: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మల్లాపూర్‌ కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్‌ సూర్యనగర్‌ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్‌ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కాకతీయ ఆసుపత్రి మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ హరిప్రకాష్‌, రాఘునాథరెడ్డి, విజయ్‌కుమార్‌, సుమంత్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు యాదగిరిగౌడ్‌, కోశాధికారి నర్సింగ్‌రావు తదితరులున్నారు.



మాజీ మున్సిపల్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌కు డాక్టరేట్‌

ఉప్పల్‌: ఉప్పల్‌ మాజీ మున్సిపల్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ లయన్‌ కృష్ణ ప్రసాద్‌కు మేర్‌ ల్యాండ్‌ స్టేట్‌ యూనివర్సిటీ డాక్టరేట్‌ ప్రదానం చేసింది. ప్రభుత్వరంగ సంస్థలోనే కాకుండా ఆయన పేదలకు చేసిన సేవలను గుర్తించి డాక్టరేట్‌తో సన్మానించారు. లయన్స్‌ క్లబ్‌ ప్రతినిధులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దళితరత్న అవార్డు గ్రహీతకు సత్కారం

మల్లాపూర్‌: దళితరత్న అవార్డు గ్రహీత బొజ్జ యాదగిరిని ఆదివారం నాచారం ఎర్రకుంటలో కాలనీపెద్దలు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాచారం వాసికి దళితరత్న అవార్డు రావడం సంతోషకరమన్నారు. మల్లికార్జున్‌గౌడ్‌, తిరుపతి, సంపత్‌, కిష్టయ్య, జంగం అశోక్‌, ప్రభాకర్‌, గద్ద క్రాంతి, కృష్ణంరాజు, సహదేవ్‌, పరుశురాం తదితరులున్నారు.

నిర్లక్ష్య డ్రైవింగ్‌.. వృద్ధురాలి మృతి

గౌతంనగర్‌: నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి వాణినగర్‌లో నివసించే మంత నాగమణి (64) గృహిణి, ఈనెల 4న పాలప్యాకెట్‌ కోసం సమీపంలోని మారుతీ నగర్‌ పాలబూత్‌కు నడుచుకుంటూ.. వస్తూ రోడ్డు దాటుతుండగా.. ఓ మినీవ్యాన్‌ (టీఎస్‌08 యూజీ2123) అతివేగంగా వచ్చి నిర్లక్ష్యంగా నడిపి ఆమెను ఢీ కొట్టి పరారయ్యాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలై, ఎడమకాలు విరిగింది. సమాచారం అందుకున్న ఆమె కుమారుడు భరణి కుమార్‌ ఘటనా స్థలానికి చేరుకుని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

ఉప్పల్‌: గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందిన ఘటన ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌ భగాయత్‌ హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లో 65 ఏళ్లున్న వృద్ధుడు మృతి చెంది ఉన్న విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలిపారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని విచారించగా.. మృతుడు భిక్షాటన చేసేవాడని నిర్ధారించారు. అనారోగ్యంతో మృతిచెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత దంత చికిత్స సేవలను సద్వినియోగం చేసుకోవాలి

డీఎంహెచ్‌వో డాక్టర్‌ ఉమాగౌరి

అల్వాల్‌: మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత దంత చికిత్స సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్‌ సి.ఉమాగౌరి అన్నారు. మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన దంత సంరక్షణ విభాగం డెంటల్‌ సర్జన్‌ డాక్టర్‌ వినోద్‌ ఆధ్వర్యంలో ఆదివారం ఓ రోగికి మొదటి మోలార్‌ దంతానికి రూట్‌ కెనాల్‌ చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆదివారం డీఎంహెచ్‌వో దంత పరీక్షలను పరిశీలించి మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇలాంటి అధునాతన దంత చికిత్స సేవలు ప్రారంభంకావడం గర్వకారణమన్నారు. మల్కాజిగిరి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలు ఈ ఉచిత దంత చికిత్స సేవలను ప్రతిరోజు వినియోగించుకోవచ్చన్నారు.

ఆర్థికసాయం

మల్లాపూర్‌: ఎస్వీనగర్‌లో కోటేష్‌ ఇంట్లో విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధమైన విషయం విధితమే. ఆదివారం బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నేత నెమలి రవికుమార్‌ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు.

ప్రశాంతంగా 'నీట్‌'

ఉప్పల్‌: ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని రెండు కేంద్రాల్లో నిర్వహించిన నీట్‌ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉప్పల్‌ కేంద్రియ విద్యాలయం-1, కేంద్రియ విద్యాలయం-2లో రెండు పాఠశాలలో నీట్‌ ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. కేవీ-1లో 384 మంది విద్యార్థులకు, 376 మంది పరీక్షలకు హాజరైనట్లు పోలీసులు తెలిపారు. కేంద్రియ విద్యాలయం-2లో 360 మందికి 357 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు.

వేసవి శిబిరం సందర్శన



వేదిక్‌ మ్యాథ్స్‌ను తెలుసుకుంటున్న గురుకుల కార్యదర్శి వర్షిని, పావనీజంగయ్య

ఘట్‌కేసర్‌: ఏదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల లలిత కళల పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి వర్షిని సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలతో కూడిన ప్రదర్శనను ఏర్పాటు చేశారు. విద్యార్థుల ప్రదర్శనను ఆమె ఆదివారం తిలకించి వారిని అభినందించారు. చదువుతో పాటు అదనపు నైపుణ్యం పెంపొందించుకోవడానికి వేసవి శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. గురుకుల విద్యాసంస్థల ఆర్థిక కార్యదర్శి కిరణ్మయి, సంయుక్త కార్యదర్శులు సంతోషి, గీత, సక్రునాయక్‌, శారద, రజని, భీమయ్య, నిర్మల, వింధ్యారాణి, ప్రిన్సిపాల్‌లు రాము, వేణుగోపాల్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఐ ఫోకస్‌' సేవలు అభినందనీయం

స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌



కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌, ఎమ్మెల్యే బండారి

ఉప్పల్‌: విద్యార్థుల్లో ఏకాగ్రత, మహిళల్లో ఆత్మ విశ్వాసం, ఉద్యోగుల్లో సమర్థత, యువతలో చైతన్యం, వ్యాపారుల్లో నైపుణ్యం మొత్తం మీద సమాజ సాధికారితకు 'ఐ ఫోకస్‌' చేస్తున్న కృషి గొప్పదని స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ అన్నారు. ఆదివారం ఉప్పల్‌ ఐ ఫోకస్‌ మిషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్‌ సండే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఏదైనా సమస్య వస్తే రాజకీయ నాయకుల వైపు చూస్తారని, నాయకులతో పాటు ప్రతి పౌరుడికి బాధ్యత ఉంటుందని తెలిపారు. హక్కుల గురించి మాట్లాడకుండా కళ్ల ముందు కనిపించే సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఐ ఫోకస్‌ ప్రతినిధులు తదితరులున్నారు.